సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి 6,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, రంగనాయకసాగర్‌లోకి 6,600 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది.



మాలలకు న్యాయం చేయాలి

సిరిసిల్లటౌన్: మాల, అనుబంధ కులాలకు రిజర్వేషన్లలో న్యాయం చేయాలని జాతీయ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాలుక సత్యం కోరారు.

గరిష్టం/కనిష్టం 31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్ డేకు 23 ఫిర్యాదులు

- ఎస్పీ మహేశ్ బి గీతే



సిరిసిల్ల క్రైం: బాధితులు తమ సమస్యలను నేరుగా వివరించేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బి గీతే పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదులను పరిశీలించి ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఇప్పుడే కొరత ఎందుకొచ్చింది?

- బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



వేములవాడ: పదేళ్లుగా రాని యూరియా కొరత ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎందుకు ఏర్పడుతుందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రశ్నించారు. వేములవాడలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వేములవాడలో కోపరేటీవ్ సొసైటీలోని రైతులకు తమ పార్టీ నాయకులు అండగా నిలిస్తే 8 మందిపై కేసు పెట్టడంపై నిలదీశారు. దసరా తర్వాత గుడి అభివృద్ధి చేస్తామంటున్నారని, సమ్మక్క–సారలమ్మ జాతర వరకు రాజన్న దర్శనాలు కొనసాగించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన పెంచుకొని మాట్లాడాలని హితవు పలికారు. నాయకులు ఆకుల దేవరాజం, తీగల రవీందర్‌గౌడ్, ఏనుగు మనోహర్‌రెడ్డి, రాజు, విజయ్, క్రాంతి, కుమార్ పాల్గొన్నారు.

గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై వివరించాలి



బోయినపల్లి(చొప్పదండి): గుడ్ టచ్.. బ్యాడ్ టచ్.. పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన ఉండాలని జిల్లా శిశు పరిరక్షణ అధికారి(డీసీపీవో) కవిత కోరారు. స్థానిక మోడల్‌స్కూల్, కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. డీసీపీవో కవిత బాల్య వివాహాలు, బాలకార్మికులు, భిక్షాటనలో ఉన్న పిల్లలు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. ఎల్పీపీవో అంజయ్య, ప్రిన్సిపాల్ ఉన్నారు.

కొత్త బస్టాండుకు బస్సులు రావాలి



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రతీ ఆర్టీసీ బస్సు కొత్త బస్టాండ్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొత్తబస్టాండు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక డిపో ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. హైదరాబాద్, సిద్దిపేటకు వెళ్లే బస్సులు కొత్తబస్టాండ్‌కు రావాలని కోరారు. అనంతరం డిపో డీఎం ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నంది శంకర్, పంతం రవి, మూశం రమేశ్, మోర రవి, మోతిలాల్‌నాయక్, జగ్గాని మల్లేశం, కూరపాటి శ్రీశైలం పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న బాలికల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్వంచ (ప్రథమ), కొత్తగూడెం(ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. ఖోఖోలో ఎల్లారెడ్డిపేట(ప్రథమ), ఇందల్‌వాయి(ద్వితీయ), వాలీబాల్‌లో ఇందల్‌వాయి(ప్రథమ), దుమ్ముగూడెం (ద్వితీయ), హ్యాండ్‌బాల్‌లో కురివి(ప్రథమ), కల్వకుర్తి(ద్వితీయ) స్థానాలు సాధించాయి. ఫుట్‌బాల్‌లో గండుగులపల్లి(ప్రథమ), ఎల్లారెడ్డిపేట(ద్వితీయ), బేస్‌బాల్‌లో గాంధారి(ప్రథమ), బాలానగర్(ద్వితీయ), హాకీలో గండుగులపల్లి(ప్రథమ), ఎల్లారెడ్డిపేట(ద్వితీయ) స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామ్‌సూరత్‌యాదవ్ వివరించారు. విజేతలుగా నిలిచిన జట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్‌లో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆయా జట్లు పాల్గొంటాయని వివరించారు.

బారులు తీరినా బస్తానే!



- ఒక్క బస్తాకు రెండు గంటల నిరీక్షణ
- ధర పెంచి అమ్ముతున్న వ్యాపారులు
- ఇప్పటికే ఓ ఎరువుల దుకాణదారుడి లైసెన్స్ రద్దు
- అయినా ఆగని దోపిడీ
- తీరని యూరియా కొరత

సిరిసిల్ల: జిల్లా రైతులకు యూరియా కొరత తీరడం లేదు. గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుంటే ఒక్క బస్తా అందుతుంది. అది కూడా ప్రైవేట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వరిపంటకు నెల రోజుల్లోపే యూరియా అందాల్సి ఉంటుంది. జిల్లాలో వరినాట్లు పూర్తయి నెల రోజులు దాటుతోంది. ఈక్రమంలోనే అన్నదాతలు తమ పంటను కాపాడుకునేందుకు యూరియా కోసం దుకాణాల వద్ద బారులుతీరుతున్నారు. జిల్లాలో ఇటీవల ఒక్కో యూరియా బస్తాను రూ.300లకు విక్రయిస్తే ఆ ఎరువుల దుకాణదారుడి లైసెన్స్‌ను వ్యవసాయ శాఖ అధికారులు రద్దు చేశారు. కానీ ఏ జిల్లా కేంద్రంలోని ఓ వ్యాపారి అదే రూ.300కు ఒక్కో బస్తాను విక్రయిస్తున్నాడు. అధికారులు మాత్రం ఆ దుకాణం వైపు చూడడం లేదు. దీంతో ఆ వ్యాపారి ఆడింది ఆటగా.. పాడింది పాటగా సాగుతోంది.

క్యూలైన్‌లో రెండు గంటలు.. రైతుకు ఒకే బస్తా

సిరిసిల్ల పెద్ద బజారులో రెండు గంటలపాటు బారులు తీరితే ఒక్క బస్తా యూరియా ఇస్తున్నారు. అన్నదాతలు ఉదయం 6.30 గంటలకు క్యూలో నిల్చుంటే 8.30 గంటలకు వారి వంతు వస్తుంది. అయితే 9 గంటల వరకు యూరియా అయిపోయిందంటూ వ్యాపారులు చేతులు ఎత్తేశారు. జిల్లా వ్యాప్తంగా 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(సింగిల్ విండో), లైసెన్స్ గల 253 ఎరువుల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 1,85,560 ఎకరాల్లో వరి, 46,205 ఎకరాల్లో పత్తి, 3,748 ఎకరాల్లో మొక్కజొన్న, 660 ఎకరాల్లో కంది పంట వేశారు. ఈమేరకు వ్యవసాయశాఖ యూరియాను జిల్లాకు తెప్పించగా రైతుల అవసరాలకు సరిపోలేదు. దీంతో రైతులు సహకార సంఘాల వద్ద బారులు తీరడం, చెప్పులు లైనులో పెట్టడం, యూరియా లారీ వస్తే మొత్తం బస్తాలు మాకే ఇవ్వాలంటూ ముట్టడించడం వంటివి జరుగుతున్నాయి. రైతుకు ఒక్క బస్తానే ఇస్తుండడంతో యూరియా సరిపోక మరుసటి రోజు కూడా ఆ రైతు దుకాణం వద్ద క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి. పెద్ద రైతులు మాత్రం ప్రైవేటు వ్యాపారుల వద్ద కాస్త ధర ఎక్కువ చెల్లించి యూరియాను దక్కించుకుంటున్నారు. చిన్న, సన్నకారులు రైతులు ఇబ్బందిపడుతున్నారు.

బఫర్ నిల్వలు పదిలం

జిల్లాలో రైతులకు అత్యవసరమైన పరిస్థితుల్లో అందించేందుకు పెద్దూరు శివారులోని అపెరల్ పార్క్ గోదాములో 140 మెట్రిక్ టన్నుల యూరియాను నిల్వ చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా చొరవతో ఈ బఫర్ నిల్వలను ఉంచారు. ఇటీవల రైతుల అవసరాల మేరకు 40 మెట్రిక్ టన్నులను సరఫరా చేశారు. ప్రస్తుతం వంద మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. జిల్లాకు ఇప్పటి వరకు 15వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా.. మరో 10వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. సింగిల్ విండోల ద్వారా 60 శాతం, ప్రైవేటు వ్యాపారులు 40 శాతం యూరియాను సరఫరా చేస్తున్నారు.

సమయం : సోమవారం ఉదయం 6.30 గంటలు
స్థలం : సిరిసిల్ల పెద్ద బజారు, ఎరువుల దుకాణం
సందర్భం : యూరియా బస్తాల కోసం రైతుల నిరీక్షణ
విశేషం : ఆధార్‌కార్డులతో వచ్చిన రైతులకు ఒక్క బస్తా ఇవ్వడం
ప్రత్యేకత : 45 కిలోల యూరియా బస్తా ధర రూ.267 ఉండగా రూ.300లకు విక్రయాలు
కొసమెరుపు : రవాణా, హమాలీ ఖర్చులు అని బుకాయింపు

మరో 500 టన్నులు వస్తుంది



జిల్లాలో ఎవరైనా ఎరువుల వ్యాపారులు ధరలు పెంచి అమ్మితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ధరలు పెంచి అమ్మిన ఓ వ్యాపారి లైసెన్స్ రద్దు చేశాం. జిల్లాకు మరో 500 టన్నుల యూరియా వస్తుంది. రైతులు ఆందోళన చెందొద్దు. పది బస్తాల యూరియా తీసుకున్న రైతులు మళ్లీ వచ్చి గొడవ చేస్తున్నారు. ఇది మంచి విధానం కాదు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయాధికారి

వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం

- ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేయండి
- రోడ్డుపై బైటాయించిన జేఎన్టీయూ విద్యార్థులు



వేములవాడ-సిరిసిల్ల రోడ్డుపై బైటాయించిన జేఎన్టీయూ విద్యార్థులు

వేములవాడఅర్బన్: మౌలిక వసతులు లేవని, తమకు ప్రత్యేకంగా క్యాంపస్ ఏర్పాటు చేయాలని జేఎన్టీయూ విద్యార్థులు సోమవారం సిరిసిల్ల–కరీంనగర్ రోడ్డుపై బైటాయించారు. వారు మాట్లాడుతూ వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల క్రితం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అధికారులు వసతుల కల్పనపై పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లలో క్యాంపస్ ఏర్పాటు చేసి వసతులు కల్పిస్తామని మాట తప్పారన్నారు. ఎనిమిది తరగతి గదులు మాత్రమే ఉన్నాయని, ల్యాబ్‌లు లేక వేరే చోటుకు తీసుకెళ్తున్నారన్నారు. కళాశాలలోని మెస్‌లో రద్దీ ఉంటుండడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనంలోని హాస్టల్ సైతం కిలోమీటర్‌కు పైగా దూరంలో ఉందన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీతో బోధన చేయిస్తున్నారన్నారు. కాలేజీ ప్రారంభమైనప్పటి నుంచి ఒక బ్యాచ్ వెళ్లిపోయిందని.. అయినా వసతులు కల్పించడం లేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎనిమిది మంది విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వదిలేశారు. వీరికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్న ఏబీవీపీ, బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది.

ఠాణాలో విద్యార్థులకు సంఘీభావం

ఇంజినీరింగ్ విద్యార్థులను వేములవాడటౌన్ పోలీసులు ఠాణాకు తీసుకెళ్లడంతో చల్మెడ లక్ష్మీనర్సింహారావు వారికి సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంజినీరింగ్ కాలేజీకి స్థలం కేటాయించినట్లు తమ నాయకుడు కేటీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం విద్యార్థులను ఠాణాకు తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సరిపడా తరగతి గదులు కేటాయించాలి

సిరిసిల్లఅర్బన్: అగ్రహారం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే సరిపడా తరగతి గదులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. ఈమేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఒకే భవనంలో డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు ఉండడంతో విద్యార్థులకు గదులు సరిపోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని జేఎన్టీయూకు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు శివ, విద్యార్థులు శ్రీనివాస్, కార్తీక్, మహేశ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.



చంద్రగ్రహణం అనంతరం ఆలయ సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు



వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని కలిసిన ఈవో రమాదేవి

రాజన్నకు మొక్కులు

వేములవాడ: సంపూర్ణ చంద్రగ్రహణం ముగియడంతో రాజన్న ఆలయంలో సోమవారం వేకువజామున సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు కల్పించారు. భీమన్నగుడి, బద్దిపోచమ్మగుడి ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఈవో రమాదేవి పరిశీలించారు. రాజన్న ఆలయంలో రూ.200 ఈ–టికెట్ విధానాన్ని ఈవో ప్రారంభించారు. భక్తులకు సత్వర సేవలందించేందుకు వీలుగా ఈ–టికెట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని ఈవో రమాదేవి మర్యాద పూర్వకంగా కలిసి, స్వామి వారి ప్రసాదం అందించారు. ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సమాలోచనలు చేశారు. ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, పర్యవేక్షకులు శ్రీకాంత్‌చార్యులు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

- దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ



పూజ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ

ఇల్లంతకుంట(మానకొండూర్): ముత్యాల పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయ 6వ వార్షికోత్సవానికి సోమవారం హాజరై మాట్లాడారు. కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో గ్రామస్తులు చర్చించుకొని.. ఒక నిర్ణయానికి రావాలని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలిపురి అంతగిరి, ఈవో మారుతీరావు, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు ముత్తయ్య, పోచవ్వ, శంకరయ్య, మల్లయ్య, తిరుపతిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రజనీకాంత్, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి



సిరిసిల్లటౌన్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇంటిస్థలంతోపాటు రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. స్థానిక పార్టీ ఆఫీస్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం అర్హులుగా గుర్తించినా డబుల్ బెడ్‌రూమ్ అందని వారిని మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలని కోరారు. ఈనెల 11న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు పాల్గొనాలని కోరారు. కోడం రమణ, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, నక్క దేవదాస్, ఎలిగేటి శీను, నాగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇక.. రెవె'న్యూ' పాలన

- 118 రెవెన్యూ గ్రామాలకు జీపీవోలు
- విధుల్లో చేరిన గ్రామపాలనాధికారులు



విధుల్లో చేరిన గ్రామ పాలనాధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కాలానుగుణంగా రెవెన్యూ శాఖలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో పటేల్ పట్వారీ వ్యవస్థ ఉండగా.. దాని స్థానంలో వీఆర్వోలు వచ్చారు. వీఆర్వోల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలనాధికారులను నియమించింది. ఐదేళ్లుగా గ్రామాల్లో రెవెన్యూ ప్రతినిధి లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్రామపాలనాధికారులు రావడం రెవెన్యూశాఖలో ఉన్నతాధికారులకు పనిభారం తగ్గించనుంది. క్షేత్రస్థాయిలో గ్రామస్తుల సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయనే ఆశాభావం వ్యక్తమవుతుంది. జిల్లాలో 118 రెవెన్యూ గ్రామాలుండగా.. ఒక్కో గ్రామానికి ఒక్కో రెవెన్యూ అధికారిని ప్రభుత్వం నియమించింది.

పటేల్ పట్వారీ నుంచి జీపీవో..

నిజాం పాలన నుంచి వచ్చిన పటేల్ పట్వారీ వ్యవస్థతో తెలంగాణ పల్లెల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. అప్పటి నుంచి 2003 వరకు గ్రామ కార్యదర్శియే రెవెన్యూ, పంచాయతీ వ్యవస్థలను చూసుకునేవారు. 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి వీఆర్వో వ్యవస్థను ప్రవేశపెట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థలో అవినీతి ఉందంటూ రద్దు చేసింది. మండల స్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ మాత్రమే ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్వో స్థానంలో జీపీవోలను తీసుకొచ్చింది.

సేవలు ఇలా..

- పథకాల అమలు, భూముల వ్యవహారాలు చూసుకోవడం.
- ఆదాయం, కులం, నివాసం సర్టిఫికెట్ల జారీపై విచారణ. అనుమతులు.
- ప్రభుత్వ ఆస్తుల రక్షణ. ప్రైవేటు భూముల నక్ష, పాస్‌బుక్కుల జారీపై విచారణ.
- ప్రకృతి వైపరీత్యాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం. బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టడం.
- వాల్టా చట్టం అమలుచేయడం.

అందుబాటులో ఉంటాం



జీపీవోలుగా నియామకమైన వారిలో అధిక శాతం గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసిన వారే. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుతో తిరిగి జీపీవోలుగా నియమితులయ్యాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు సత్వర రెవెన్యూ, భూ సేవలను అందిస్తాం. క్షేత్రస్థాయిలో నిబంధనల మేరకు పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటాం.

– రాజేందర్, జీపీవో, ముస్తాబాద్

సత్వర రెవెన్యూ సేవలు



ప్రజలకు సత్వర రెవెన్యూ సేవలను జీపీవోలు అందిస్తారు. ధ్రువీకరణపత్రాల విచారణ, రెవెన్యూ భూరికార్డులు, ప్రజల ఆస్తుల పరిరక్షణ వంటి వాటిపై కీలకంగా పనిచేస్తారు. జీపీవోలతో మండల, జిల్లా స్థాయి అధికారులకు తక్షణ సమాచారం అందుబాటులో ఉంటుంది. పని భారం తగ్గుతుంది.

– సురేశ్, తహసీల్దార్, ముస్తాబాద్

సమస్యలు పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- వివిధ సమస్యలపై 154 అర్జీలు
- వెంటనే పరిష్కరించండి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల అర్బన్: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో జిల్లా నలుమూలల నుంచి బాధితులు కలెక్టరేట్‌కు తరలివస్తున్నారు. స్థానిక అధికారులు స్పందించడం లేదని.. భూమి కబ్జా చేశారని.. పింఛన్ రావడం లేదంటూ కలెక్టర్‌కు విన్నవిస్తున్నారు. వివిధ సమస్యలపై సోమవారం 154 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ అధికారులు సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. రెవెన్యూ అధికారి గడ్డం నగేశ్, వేములవాడ ఆర్డీవో రాధాభాయి, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్డీవో శేషాద్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యుత్ దీపాలు వెలగడం లేదు



మాది మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు రగుడు. వారం రోజులుగా గ్రామంలోని పలు వార్డుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు, సెస్ సిబ్బందికి చాలా సార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– దొంతుల చంద్రం, రగుడు

మార్కెట్ కమిటీల ద్వారా సరఫరా చేయాలి



మార్కెట్ కమిటీల ద్వారానే రైతులకు అవసరమయ్యే విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేయాలి. ఫర్టిలైజర్ షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేయాలి.

– ఆలూరి మల్లారెడ్డి, వేములవాడ అర్బన్

నా పేరు మీద ప్రొసీడింగ్ ఇవ్వండి



మాది ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల. 2008లోనే అమ్మనాన్నా చనిపోయారు. ప్రస్తుతం నేను అనాథను. 2015లో కురి సిన వర్షానికి శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలిపోయింది. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నాను. నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నా పేరు మీద ప్రొసీడింగ్ ఇస్తే ఇల్లు కట్టుకుంటాను.

– పందుగ అంజనేయులు, వల్లంపట్ల

కోతుల నుంచి కాపాడండి



మాది కోనరావుపేట మండలం కనగర్తి. మా గ్రామంలో పత్తి పంటలతోపాటు ఇతర ఆరుతడి పంటలు సాగుచేశాం. కోతులు పంటలపై దాడిచేసి తీవ్ర నష్టం చేస్తున్నాయి. బడికి వెళ్లే విద్యార్థులు, స్థానికులు కోతులతో ఇబ్బంది పడుతున్నారు. కోతులను నివారించాలి.

– కనగర్తి గ్రామ రైతులు

ఉపాధ్యాయులను నియమించండి



మాది కందికట్కూర్ ప్రభుత్వ పాఠశాల. మా బడిలో ముగ్గురు టీచర్లు ఉండేవారు. ఇప్పుడు ఒకరు బదిలీపై వెళ్లారు. ఈనెలలో ప్రధానోపాధ్యాయుడు రిటైర్‌మెంట్ అవుతారు. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉన్నారు. 85 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలి.

– అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, కందికట్కూర్

క్లుప్తంగా

దొరికిన శ్రీకర్ మృతదేహం


శ్రీకర్‌రెడ్డి

జగిత్యాలక్రైం/కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారులో ఎస్సారెస్పీ కాలువలో గతనెల 27న ట్రాక్టర్ పడి గల్లంతైన కాటిపల్లి శ్రీకర్ రెడ్డి మృతదేహం సోమవారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి శివారు ఎస్సారెస్పీ కాలువలో లభ్యమైంది. శ్రీకర్ బంధువులు, కుటుంబ సభ్యులు 13 రోజులుగా ఆచూకీ కోసం వెదుకుతూనే ఉన్నారు.

చనిపోయి పడి ఉంటాడా..?

వినాయక చవితి రోజు తమ రైస్‌మిల్లులో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి మరోచోట వినాయకుని ప్రతిష్ఠ కోసం శ్రీకర్‌రెడ్డి తన ముగ్గురు స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌లో వెళ్లాడు. రైస్‌మిల్లుకు ఎదురుగా ఎస్సారెస్పీ కెనాల్ ఉండగా ట్రాక్టర్.. ట్రాలీకి మధ్య ఉన్న శ్రీకర్‌రెడ్డి ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ ట్రాలీకి ఢీకొని మృతి చెంది ఉంటాడని, సుమారు 20 మీటర్ల లోతులో ఉన్న కెనాల్ నీటిలో పడిపోయి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈతవచ్చే శ్రీకర్‌రెడ్డి నేరుగా నీటిలో పడి ఉంటే ఇతర స్నేహితులతోపాటు బయటకు వచ్చే అవకాశాలు ఉండేవి. కానీ.. ట్రాక్టర్ కెనాల్‌లోకి దూసుకెళ్తున్న సమయంలోనే దెబ్బలు తగలడంతో శ్రీకర్‌రెడ్డి స్పృహలేని స్థితిలోనే కెనాల్ నీటిలో పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ కారణంగానే పన్నెండు రోజులు గడిచినా శ్రీకర్‌రెడ్డి మృతదేమం పెద్దగా దెబ్బతినలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెద్దాపూర్‌లో విషాదం

శ్రీకర్‌రెడ్డి చనిపోయి ఉండకపోవచ్చన్న ఆశతో 12 రోజులుగా కాలం గడిపిన తండ్రి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆశలు నీరుగారిపోయాయి. శ్రీకర్‌రెడ్డి కెనాల్‌లో గల్లంతైన మరుసటి రోజే నీటిని ఆపేసి వారం పాటు గాలించినా ఫలితం దక్కలేదు. చివరికి తాటిపల్లి వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌లో శ్రీకర్‌రెడ్డి మృతదేహం కనిపించడంతో పెద్దాపూర్‌లో విషాదం నెలకొంది. సోమవారం సాయంత్రం కాటిపల్లి శ్రీకర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీమంత్రి జీవన్‌రెడ్డి కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

మంథనిరూరల్: పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్ గ్రామ శివారులోని ఎల్.మడుగు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం పొలం పనులకు వెళ్లిన వారికి దుర్వాసన రావడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రమేశ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా వ్యక్తి మృతదేహం కనిపించింది. భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరిగి మృతదేహం కొట్టుకు వచ్చిందని పోలీసులు అనుమానిస్తున్నారు. మూడు రోజుల క్రితం వినాయక నిమజ్జనం సందర్భంగా గోదావరిఖనిలోని గోదావరినదిలో యువకుడు రాజేశ్ గల్లంతైన విషయం తెలిసిందే. ఈ మృతదేహం రాజేశ్‌దే అని తొలుత భావించిన పోలీసులు.. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని రాజేశ్‌ది కాదని చెప్పడంతో మృతదేహం ఎవరిదనేది తేలాల్సి ఉంది.

దొంగబంగారం కొంటే కటకటాలే

కరీంనగర్ పరిధిలో ఇటీవల జరిగిన ఆరు చోరీ కేసుల్లో నిందితులు పోలీసులకు చిక్కారు. ఇందులో ఇద్దరు దొంగతనం చేసినవారుండగా.. మరో ఇద్దరు వారినుంచి బంగారం కొనుగోలు చేసినవారున్నారు. అందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల తిమ్మాపూర్ పరిధిలో దొంగతనాలు చేసిన నిందితుడు బంగారాన్ని ఓ వ్యాపారికి అమ్మాడు. పోలీసులు సదరు వ్యక్తిని కూడా నిందితుడిగా కేసులో చేర్చారు.



- దొంగలతో పాటు కొనుగోలు చేసిన వారిపైనా కేసు
- తక్కువ ధరకు వస్తుందని కొంటున్న వ్యాపారులు
- ఆఫై కేసుల చుట్టూ తిరుగుతున్న వైనం
- చోరీ సొత్తు కొనొద్దంటున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: జిల్లాలో చోరీ కేసులు పెరిగిపోతున్నాయి. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకుని జైలుకు తరలిస్తున్నారు. కాగా.. విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. నిందితులు ముందుగానే దొంగసతం చేసిన సొత్తును కొనుగోలు చేసేవారిని వెతుక్కుంటున్నట్లు తెలుస్తోంది. చోరీ చేసిన బంగారాన్ని అమ్మి డబ్బులు తీసుకుంటున్నారు. దొంగబంగారం బయట ఎవరూ కొనుగోలు చేయరు కాబట్టి.. ప్రత్యేకంగా పలువురు వ్యాపారులు దొంగల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ అడ్డదారిలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆలోచన చేస్తున్నారు. దొంగతనం కేసుల్లో నిందితులు పోలీసులకు పట్టుబడినప్పుడు రికవరీ కోసం ఎక్కడ అమ్మారు అనే విషయాలు లోతుగా అడగడంతో గోల్డ్ వ్యాపారుల పేర్లు చెప్పడంతో వారినీ నిందితుల జాబితాలో చేర్చుతున్నారు.

ఇటు బంగారం.. అటు డబ్బు నష్టం

దొంగతనం కేసుల్లో నిందితుల వద్ద నుంచి బంగారం కొనుగోలు చేసి డబ్బు చెల్లిస్తున్నారు. కొన్ని రోజుల తరువాత పోలీసులు దొంగతనం చేసిన నిందితులను పట్టుకొని, గోల్డ్ వ్యాపారుల నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారులు అటు డబ్బు ఇటూ బంగారం కోల్పోవడంతో పాటు కేసుల్లో ఇరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దొంగ బంగారాన్ని కొనేందుకు ఒక ముఠానే ఉందని సమాచారం. దొంగ బంగారాన్ని మార్కెట్ రేటులో 25 నుంచి 50శాతానికే కొనుగోలు చేస్తుండడంతో పెద్ద ఎత్తున లాభం ఉంటుంది. గుట్టుచప్పుడు కాకుండా కరిగించి మార్కెట్ రేటుకు అమ్ముకొని లాభాలు పొందుతున్నారు. పోలీసులకు చిక్కితే బంగారంతో పాటు డబ్బులు నష్టపోతున్నారు. కరీంనగర్, జగిత్యాల, నిర్మల్, ఆర్మూర్ వంటి ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. దొంగ బంగారం కొనుగోలు చేస్తే పోలీసులకు చిక్కకతప్పదని, కోర్టు కేసులు వెంటాడుతాయని హెచ్చరిస్తున్నారు.

బాలిక ఆరోగ్యానికి కలెక్టర్ భరోసా

- చికిత్స కోసం ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: ఆరోగ్యం బాగ లేక ఇబ్బంది పడుతున్న బాలికకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బాసటగా నిలిచారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మిడిదొడ్డి భాగ్య కూతురు వెన్ను ఎముకకు సంబంధించిన సమస్యతో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో అసహాయ స్థితిలో బాలిక తల్లి మిడిదొడ్డి భాగ్య సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు తన ఆవేదనను విన్నవించింది. స్పందించిన కలెక్టర్ ఆ బాలిక శస్త్రచికిత్స కోసం రూ.74,938 ఆర్థిక సహాయం చెక్కును అందించారు. తన కూతురు ఆపరేషన్ కోసం వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్‌కు భాగ్య చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

పసి బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి

- వైద్యం కోసం వేడుకుంటున్న తండ్రి
- దాతల సహాయం కోసం ఎదురుచూపు


సహాయం కోసం అర్థిస్తున్న సుధాకర్

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన కట్టెకోల సుధాకర్, అర్చన దంపతులకు రెండు రోజుల క్రితం ఆడ శిశువు 800గ్రాముల బరువుతో జన్మించింది. ఆమెను వెంటిలేటర్‌పై సుమారు మూడు నెలలపాటు ఉంచాలని వైద్యులు చెప్పడంతో ఆ నిరుపేద తండ్రి బిడ్డను బతికించుకునేందుకు నానాపాట్లు పడుతున్నాడు. సుధాకర్ మెకానిక్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బిడ్డ వైద్యానికి సుమారు రూ.మూడు లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు అంటున్నారు. బంధువుల సహకారంతో మెడికల్ బిల్లు మాత్రమే చెల్లిస్తున్నారు. తన చేతిలో చిల్లగవ్వ లేదని, దాతలు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. ఆదుకునేవారు 96183 25316 నంబర్‌లో సంప్రదించాలని వేడుకుంటున్నారు.

లెవల్ క్రాసింగ్ గేట్లకు మరమ్మతు


ఓదెలలో మూసివేసిన లెవల్ క్రాసింగ్ గేట్

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట– మల్హర్ష సెక్షన్ల మధ్యలోని ఓదెల, పొత్కపల్లి రైల్వేస్టేషన్ల సమీప లెవల్ క్రాసింగ్ గేట్‌ల మరమ్మతు కొద్దిరోజులుగా సాగుతోంది. దీంతో రైళ్ల వేగం బాగా తగ్గింది. ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు చాలా ఆలస్యంగా నడవడంతో గమ్యస్థానాలు చేరుకునేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఓదెలలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, స్థానికులు, పొత్కపల్లిలో గేట్‌తో జమ్మికుంట నుంచి సుల్తానాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. గేట్ మరమ్మతు సందర్భంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ గనిలో దొంగలు పడ్డారు

- పంప్ ఆపరేటర్ అప్రమత్తతతో దొంగల పరార్


దొంగలు గనిలోకి వెళ్లిన ప్రదేశం ఇదే..

గోదావరిఖని: కాపర్ కోసం పదిమంది సభ్యులు గల దొంగల ముఠా ఏకంగా భూగర్భగనిలో చొరబడింది. ఆదివారం అర్ధరాత్రి ఎల్‌డీఎల్ యంత్రాలు లోనికి పంపించే దారి గుండాలోనికి వెళ్లారు. ఇందుకోసం గనిపై, లోపల ఉన్న ఐరన్‌మెస్లు తొలగించారు. పంప్ ఆపరేటర్ దొంగలను చూసి అప్రమత్తమై గనిపైఉన్న అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో దొంగలు పలాయనం చిత్తగించారు. ఆర్జీ –వన్ ఏరియాలోని జీడీకే–2,2ఏగనిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌డీఎల్ యంత్రాలు గనిలోకి పంపించే ప్రత్యేక దారిని సాధారణ రోజుల్లో మూసేస్తారు. దీనిని గమనించిన దొంగలు గని వద్దకు చేరుకున్నారు. మద్యం తాగి, స్నాక్స్ తిని గనిలోనికి వెళ్లింది. పంప్ ఆపరేటర్ దొంగలను చూసి ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం చేరవేడంతో సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, నాలుగు బృందాలు గని ప్రత్యేక టన్నెల్ వద్దకు చేరుకున్నారు. వీరినిచూసిన దొంగలు పరారైనట్లు చెబుతున్నారు. చోరీ ఘటనను కవర్ చేయడానికి వెళ్లిన పాత్రికేయులతో సెక్యూరిటీ గార్డు రుసరుసలాడారు. తన అనుమతి లేకుండా ఫొటోలు తీయడానికి మీరెవరంటూ బెదించాడు. ఈవిషయంపై సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి మాట్లాడుతూ, సకాలంలో తాము గనిపైకి చేరుకోవడంతో దొంగలు పారిపోయారని, సంస్థ ఆస్తికి నష్టం వాటిల్లలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వృద్ధుల బలవన్మరణం

గొల్లపల్లి: వేర్వేరు ఘటనల్లో మండలానికి చెందిన ఇద్దరు వృద్ధులు బలవన్మరణానికి పాల్పడ్డారు. శంకరావుపేట గ్రామానికి చెందిన గోలి రాజేందర్ (64) భార్య కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో మానసికంగా కృంగిపోయాడు. గతేడాది అతని కొడుకుకూ గుండె ఆపరేషన్ జరిగి ఇంటివద్దనే ఉంటున్నాడు. వివిధ అవసరాల కోసం చేసిన అప్పును తనకున్న నాలుగెకరాల పొలాన్ని విక్రయించి చెల్లించాడు. ఇవన్నీ సంఘటనలతో మనస్తాపానికి గురైన రాజేందర్.. ఆదివారం తన ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. బంధువులు జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. రాజేందర్ కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కడుపునొప్పి భరించలేక..

మల్లన్నపేట గ్రామానికి చెందిన ఉప్పు మల్లవ్వ(80) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించుకున్నా.. నయం కాలేదు. మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్థానికులు చుట్టుపక్కల వెదుకుతుండగా.. గ్రామశివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. కుమారుడు ఉప్పు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టు పైనుంచి పడి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట పంచాయతీలో కార్మికుడు బండ రాజయ్య (52) నిచ్చెన పైనుంచి జారి పడడంతో మరణించాడు. నిచ్చెనపై నిలుచుని చెట్టు కొమ్మలను కొడుతుండగా జారి కింద పడిపోయాడని రూరల్ ఎస్సై మల్లేశ్ తెలిపారు. వెంటనే స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజయ్య మృతిచెందాడని నిర్ధారించారని వివరించారు.

పెళ్లయిన రెండు నెలలకే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం


ఆనంద్ (ఫైల్)

పెగడపల్లి: పెళ్లయిన రెండు నెలలకే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పెగడపల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గారం మండలం శెకల్లకు చెందిన జక్క ఆనంద్ (25)కు పెగడపల్లి మండలంలోని బతికపల్లికి చెందిన సలాది రాజయ్య, సరా కూతురు రమ్యతో రెండు నెలల క్రితం వివాహమైంది. ఆనంద్ ఆదివారం రాత్రి బతికపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మండలంలోని లింగాపూర్ శివారులో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆనంద్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఆనంద్ తండ్రి జానయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆనంద్ మృతితో ఇరువురి కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి.

యువకుడి ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు


సుందిళ్ల బ్యారేజీ వద్ద డ్రోన్‌తో పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్


యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 6న గోదావరి నదిలో గల్లంతైన రామగుండంలోని అక్బర్‌నగర్‌కు చెందిన రాజేశ్ ఆచూకీ కోసం పోలీసులు సోమవారం కూడా గాలింపు చర్యలు కొనసాగించారు. గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు నదిలో పడిపోయిన విషయం విదితమే. గోదావరిఖని ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో డ్రోన్ సాయంతో ఇందారం బ్రిడ్జి నుంచి సుందిళ్ల, బ్యారేజీ, మంథని బ్రిడ్జి వరకు గాలించారు. అయినా యువకుడి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

కొత్తపేట రైతులకు రూ.79.84లక్షల ప్యాకేజీ

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడలో నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టులో భూములు కోల్పోయిన కొత్తపేటకు చెందిన పలువురికి రూ.79,84,370 పరిహారం మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో కొత్తపేటకు చెందిన 75 మంది రైతులు తమ భూములను కోల్పోయారు. వారు కొన్నాళ్లుగా ప్యాకేజీ కోసం ఎదురుచూస్తున్నారు. కాగా భూములు కోల్పోయిన 75 మంది రైతులను పీఏఎఫ్ కుటుంబాలుగా గుర్తించి వారికి పనిదినాల కింద పరిహారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. 2025 ఆర్‌అండ్‌ఆర్ పాలసీ కింద ఈ పరిహారం మంజూరైనట్లు పేర్కొన్నారు.

మల్లన్నసాగర్‌కు తరలుతున్న 'గంగమ్మ'

- 25 టీఎంసీలు లక్ష్యం
- ఇప్పటికే 10 టీఎంసీలు తరలింపు
- అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్ మీదుగా ఎత్తిపోతలు
- 27 టీఎంసీలతో నిండుకుండలా మిడ్‌మానేరు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్‌కు గోదావరి జలాలు తరలిపోతున్నాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 50 టీఎంసీలు కాగా ఇక్కడి నుంచి 25 టీఎంసీలు తరలిచాలనే లక్ష్యంతో ఎత్తిపోస్తున్నారు. ముందుగా అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలించి అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయక్ సాగర్ నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు ఎత్తిపోస్తున్నారు.

మిడ్ మానేరుకు 44 టీఎంసీల ఇన్‌ఫ్లో

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మిడ్‌మానేరులోకి గత 15 రోజుల్లోనే 37 టీఎంసీల వరకు ఇన్‌ఫ్లో చేరింది. ఇందులో మెజార్టీగా 20 టీఎంసీలు ఎస్సారెస్పీ నుంచి, మరో 17 టీఎంసీలు వరద ద్వారా వచ్చింది. గత జూన్ 1 నుంచి సెప్టెంబర్ 4 వరకు 44 టీఎంసీల మేర ఇన్‌ఫ్లో వచ్చింది. ఇందులో ఎల్లంపల్లి నుంచి 6.766 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 20.080 టీఎంసీలు, వరద ద్వారా 17.071 టీఎంసీల మేర నీరు మిడ్‌మానేరులోకి చేరింది. మిడ్‌మానేరు నుంచి 24 టీఎంసీల ఔట్‌ఫ్లోగా వెళ్లింది. ఇందులో కరీంనగర్ ఎల్ఎండీకి 11 టీఎంసీలు, అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 13 టీఎంసీలు, ఎడమ కాలువకు 0.002 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 0.963 క్యూసెక్కులు తరలించారు. ప్రస్తుతం మిడ్‌మానేరులో 26.042 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి 13,150 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్ మానేరు నుంచి ప్యాకేజీ–10లోకి 12,800, ఎల్ఎండీకి వేయి క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరు టు మల్లన్నసాగర్

మిడ్‌మానేరు నుంచి సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ వరకు సుమారు 70 కిలోమీటర్ల మేర నీటిని పంపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణలో 3.5, రంగనాయక్‌సాగర్‌లో 3, మల్లన్నసాగర్‌లో 25, కొండపోచమ్మసాగర్‌లో 12 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈనెల 4 వరకు అన్నపూర్ణలోకి 1.38, రంగనాయకసాగర్‌కు 1.51, మల్లన్నసాగర్‌కు 9.34, కొండ పోచమ్మసాగర్‌లోకి 2.28 టీఎంసీల మేర మొత్తం 14.51 టీఎంసీల మేర నీటిని ఎత్తిపోశారు. ఇంకా అన్నపూర్ణకు 0.84, రంగనాయకసాగర్‌కు 0.47, మల్లన్నసాగర్‌కు 5.412, కొండపోచమ్మసాగర్‌కు 4.9 టీఎంసీలు మొత్తం 11.62 టీఎంసీల మేర నీటిని ఎత్తిపోయడం ఉందని అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల స్వరూపం

ప్రాజెక్టు	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీలు)
మిడ్ మానేరు	27.55	27.19
అన్నపూర్ణ	3.50	2.68
రంగనాయకసాగర్	3	2.54
మల్లన్నసాగర్	50	19.59
కొండపోచమ్మసాగర్	15	7.1

మిడ్ మానేరులో 27 టీఎంసీలు

20 రోజులుగా మిడ్‌మానేరులోకి ఎస్సారెస్పీ జలాలతోపాటు వర్షాలతో వరద నీరు సుమారు 37 టీఎంసీల మేర చేరింది. ప్రాజెక్టులో నీటిమట్టం 27 టీఎంసీలకు చేరడంతో ప్రభుత్వ ఆదేశాలతో అన్నపూర్ణ ప్రాజెక్టులోకి కొద్ది రోజులుగా రోజుకు 11 నుంచి 12 వేల క్యూసెక్కుల మేర నీరు తరలిస్తున్నాం.

– జగన్, మిడ్ మానేరు, ఈఈ



నిండుగా 'ఎల్లంపల్లి'

రామగుండం: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి సోమవారం స్వల్పంగా ఇన్‌ఫ్లో వచ్చిచేరింది. నాలుగు గేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. గోదావరిలోకి మొత్తం 22,328 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా అంతే మొత్తంలో నిల్వలు ఉన్నట్లు వారు వివరించారు.

కారు, లారీ ఢీ: ఇద్దరికి గాయాలు


గాయపడిన అబీద్

ధర్మపురి: ఎదురెదురుగా వస్తున్న కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మండలంలోని రాయపట్నం పెట్రోలు పంపు వద్ద సోమవారం రాత్రి కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కరీంనగర్‌కు చెందిన అబీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. దుర్గం వెంకటరమణకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో కరీంనగర్‌కు తరలించారు.

మన నేత్రాలకు మరోజన్మ

- సిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ నరేందర్


టెక్నీషియన్ ప్రదీప్ నాయక్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కోల్‌సిటీ (రామగుండం): మరణించినా.. మన నేత్రాలకు మరోజన్మను పొందే అవకాశం ఉంటుందని, నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని గోదావరిఖని సిమ్స్ వైస్ ప్రిన్సిపల్ నరేందర్ అన్నారు. నేత్రదానం పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని సోమవారం సిమ్స్‌లో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించారు. నరేందర్ మాట్లాడుతూ, నేత్రదాన మహాయజ్ఞంలో అందరూ పాల్గొనాలన్నారు. నేత్ర, అవయవ, శరీర దానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. జీజీహెచ్ ఆర్ఎంవో దండే రాజు, అప్తమాలజిస్ట్ ప్రొఫెసర్ గోపీకృష్ణ, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ ఓబులేశ్ మాట్లాడుతూ, నేత్రదానానికి ముందుకు వచ్చే వారితోపాటు మరణించిన వారినేత్రాలను విషాదంలో కూడా దానం చేసిన కుటుంబాల త్యాగం గొప్పదని కొనియాడారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు సానా రామకష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు మాట్లాడారు. కార్నియాలను సేకరించే విధానం, కార్నియాలను నిల్వ చేసే పద్ధతిపై ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ అవగాహన కల్పించారు. ఆయనను ఈ సందర్భంగా సత్కరించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు మిట్ట సత్యం, మిట్టపల్లి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'కాళేశ్వరం' ఫ్లెక్సీలు

- బీఆర్ఎస్ ప్రచారపర్వం
- ఆసక్తికర చర్చ


మల్కపేట రిజర్వాయర్ వద్ద వెలసిన ఫ్లెక్సీ


సిరిసిల్లలో వెలసిన ఫ్లెక్సీ

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కొత్త అధ్యాయానికి తెరలేపింది. అధికారంలో ఉన్న పార్టీ తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఫ్లెక్సీలు, హోర్డింగుల ద్వారా ప్రచారం చేసుకోవడం చూస్తుంటాం. కానీ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఊరూరా ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తుంది. 'కాళేశ్వరం లేకుంటే... రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఈ జలాశయాలు ఎక్కడివి?, లక్షలాది ఎకరాలకు నీళ్లు ఎక్కడివి?' అంటూ ప్రచారం మొదలుపెట్టింది. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.55 టీఎంసీలతో నిర్మించిన మధ్యమానేరు, కోనరావుపేట మండలం మల్కపేట వద్ద 3 టీఎంసీలతో నిర్మించిన మల్కపేట రిజర్వాయర్, ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద 3.5 టీఎంసీల అన్నపూర్ణ రిజర్వాయర్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కాళేశ్వరం ప్యాకేజీ–9, 10, లింకు 3, 4లను రూ.4,468 కోట్లతో నిర్మించిన జలాశయాలతో 1,11,150 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో గులాబీరంగు, వేములవాడ నియోజకవర్గంలో తెల్లరంగుల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చకు దారితీసింది.

పార్టీ శ్రేణుల్లోనూ చర్చ

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని, ఘోష్ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో చర్చ నడుస్తుంది. మరో వైపు కాళేశ్వరం కూలిపోతే గోదావరి నీళ్లు ఎలా జిల్లాకు చేరాయని బీఆర్ఎస్ శ్రేణులు చర్చకు తెరలేపారు. కాళేశ్వరం నుంచి చుక్కనీటిని లిఫ్ట్ చేయడం లేదని, దేవాదుల ద్వారా నీరు వస్తోందని కాంగ్రెస్ శ్రేణులు వాదిస్తుంటే.. దేవాదుల ద్వారా మధ్యమానేరుకు ఎలా నీరు వస్తోందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. లక్ష్మి, గాయత్రీ పంప్‌హౌస్‌లను ఎవరు నిర్మించారంటూ నిలదీస్తున్నారు. కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన పంపుహౌస్‌లతోనే మిడ్‌మానేరు వరకు నీటిని ఎత్తిపోస్తున్నారంటున్నారు. ఏదీ ఏమైనా జిల్లాలో ఫ్లెక్సీ రాజకీయం నడుస్తోంది.